

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా





సంపుటి - 06 | సంచిక 79 | ఎడిటర్ : బరిగెల శివ | సోమవారం 10, ఫిబ్రవరి 2025 | పేజీలు 4 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


## ఢిల్లీ పీఠం ఎందుకు చెదిరింది

- మోడీ ప్రభంజనమైతే దేశ అభివృద్ధి ఎందుకు మరుగున పడుతుంది.?
- కేజ్రీవాల్ ను స్కాములలో ఇరికించడం పక్కా ప్లాన్ కాదా.?
- దేశమంతా రాజకీయ లబ్ది కోసం రాజీలేని పోరాటాలు చేస్తున్నారా!
- పార్టీలు మారడం అభివృద్ధి పేరు చెప్పడం దేశ రాజకీయాల్లో సంచనంగా మారిపోయింది
- ఢిల్లీ ఎన్నికల పోలింగ్ ముందురోజు పార్టీమారిన ఆప్ ఎమ్మెల్యేల సంగతేంది?
- అసాంకేతిక ఎన్నికల నిర్మాణం న్యాయ నిపుణులకే అంతుచిక్కడం లేదు
- దేశ రాజకీయాల్లో సంభవిస్తున్న పెనుమార్పులు ప్రతిపక్షాలను కులదోయడానికేనా?
- డాక్టర్ బరిగెల శివ

# ప్రజాస్వామ్య ఎన్నికల్లో.. ఫలితాలు తారుమారు ?




హైదరాబాద్(జై భీమ్ డెస్క్)

అధికారంతో ఏం చేసినా అడిగే నాధుడే ఉండొద్దు అనే విధంగా భారతదేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో జరిగిన రాజకీయ ప్రత్యక్ష ఎన్నికల నియమావళి నిదర్శనమని డాక్టర్ బరిగెల శివ వాక్యానించారు. రాజకీయ స్వలాబ్ధికోసం పార్టీలకతీతంగా రాజకీయ నాయకులు రాజీలేని పోరాటదారులుగా మారిపోయాయన్నారు. ఒకప్పుడు రాజకీయ నాయకులు అంటే ప్రజలకు ఎంతో నమ్మకం, విశ్వాసం అభిమానాలు, ఉండేవన్నారు.నేటి రాజకీయ నాయకులపై ఎక్కువ శాతం ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతుండడం పట్ల రాజకీయ నాయకులు ఏ మాత్రం ప్రజాసేవ పట్ల పట్టింపులేనివారుగా ప్రవర్తిస్తుండడం దానితోపాటు రాజకీయ పదవుల ఆశల కోసమేనన్నారు.ఢిల్లీ పీఠం చెదిరిపోవడం ఆప్ పార్టీ ఓటమిపాలవడం వెనకాల జరిగినటువంటి కుట్రలను భారతదేశ ప్రజలు అంచనా వేయలేకపోతున్నారన్నారు. ఢిల్లీ పీఠాన్ని కైవసం చేసుకోవాలనే ఏకైక లక్ష్యంతో ముందుగానే ప్రణాళికలు చేసుకున్న ప్రభుత్వ పెద్దలు ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ను లిక్కర్ స్కామ్ లో ఇరికించి

- మిగతా 2లో..

## బిఆర్ఎస్ పార్టీ భస్మాసుర హస్తమే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ పరాజయానికి కారణం

ఎమ్మెల్సీ కవిత, కేజ్రివాల్ ల లిక్కర్ స్కాం ఆమ్ ఆద్మీ పార్టీని ఢిల్లీ ప్రజలకు దూరం చేసింది

ఢిల్లీ అసెంబ్లీ ఫలితాలనుద్దేశించి రాహుల్ గాంధీ పై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు అహంకారపూరితమైనవి

ఈ అహంకారాన్ని అణచివేసేందుకే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు బిఆర్ఎస్ కు బుద్ధి చెప్పారు

అధికార పక్షమైన, ప్రతిపక్షమైనా కాంగ్రెస్ పార్టీది ఎప్పుడూ పోరాట పంథానే

కాంగ్రెస్ పార్టీ పరమోన్నత లక్ష్యం ప్రజా సంక్షేమమే



వివరాలు 3లో

## కేంద్రంపై పోరుకు దక్షిణాది రాష్ట్రాలు ఏకం కావాలి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి


రాజ్యాంగం కల్పించిన హక్కులు కాపాడుకుందాం

రైజింగ్ తెలంగాణ... నినాదం కాదు విధానం

కేరళలో సీఎం రేవంత్ రెడ్డి..

హైద్రాబాద్ జై భీమ్ న్యూస్

దక్షిణాది రాష్ట్రాల పట్ల కేంద్రం వ్యవహరిస్తున్న తీరు ప్రమాదకరంగా ఉందని.. హక్కుల్ని కాపాడుకోవడానికి అన్ని రాష్ట్రాలు ఏకం కావాల్సి ఉందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేరళలో మాతృభూమి మీడియా సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను కాపాడుకునేందుకు నడుం బిగించాల్సిన సమయం వచ్చిందన్నారు. దక్షిణాది సమర్థంగా జనాభాను నియంత్రించి, మరింత పకడ్బందీగా సంక్షేమాన్ని అమలు చేసినందుకు శిక్షిస్తున్నారా అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. నియోజకవర్గాల పునర్విభజనలో అన్యాయం జరిగే అవకాశం కూడా ఉందన్నారు. తెలంగాణను ఈ సదస్సులో రేవంత్ రెడ్డి ప్రమోట్ చేసుకునే ప్రయత్నం చేశారు. తెలంగాణ. రైజింగ్ అనేది నినాదం కాదని విధానమన్నారు. హైదరాబాద్ ఓఆర్ఆర్ లోపల ఉన్న నగరం మాత్రం కోర్ అర్బన్ ఏరియాగా గుర్తించామని నెట్ జీరో లెవల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో ఫోర్త్ సిటీ నిర్మిస్తున్నారని.. ఇది ప్రపంచంలోనే ప్రణాళికాబద్ధంగా నిర్మించబోతున్న మొదటి నగరం అన్నారు. తెలంగాణ పదేళ్లలో పాతిక వేల కోట్ల పెట్టుబడులు సాధించలేకపోయిందని.. కానీ తాము వచ్చిన ఏడాదిన్నర కాక ముందు రెండు లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు సాధించామన్నారు. రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా కేరళ మీడియా ఇంటర్వ్యూకు ఇచ్చారు. రేవంత్ రెడ్డిని దక్షిణాది ప్రముఖ కాంగ్రెస్ నేతగా గుర్తిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన మాటలకు దేశవ్యాప్తంగా ప్రాధాన్యత లభిస్తోంది.





## రాజ్యాంగ రక్షణలో ఆత్మగౌరవ పొగరు దాగింది

రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి ఇచ్చిన ?

మాటకు కట్టుబడి ఉంటాను

భారతదేశ ప్రామాణికలు విలువలతో

ఉన్నాయంటే రాజ్యాంగ పుణ్యమే

ఫెడరల్స్ స్ఫూర్తికి వ్యతిరేక ఉద్యమాలు జరగాల్సి ఉంది

రాజకీయ స్వార్థం వీడితేనే ప్రజాసేవ చేయగలం

బలమైన సేవ భావమే ప్రజా క్షేత్రంలో బలంగా నిలబెడుతుంది

అడ్డంకులను ఎదురుకొని అధిగమించాలంటే

ఆత్మస్థైర్యం గొప్పదై ఉండాలి

మలియాళీ దినపత్రిక ముఖాముఖి కార్యక్రమంలో

సీఎం రేవంత్ రెడ్డి

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

## సంపాదకీయం

# ట్రంప్ దూకుడు పర్యవసానాలు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ నెల 4వ తేదీన చేసిన ఒక ప్రకటన ప్రపంచం అంతటా పెద్ద సంచలనం రేపుతున్నది. అదేమిటో ముందుగా చూసి తర్వాత వివరాలలోకి వెళదాము. ఆయన ఆ రోజున మీడియా సమావేశంలో మాట్లాడుతూ అన్నది ఈ విధంగా ఉంది. గాజా నుంచి పాలస్తీనా ప్రజలను పూర్తిగా ఇతర దేశాలకు తరలిస్తారు. వారిని వీలైతే ఒకే ప్రాంతంలో, వీలుకానట్లయితే వేర్వేరు ప్రాంతాలకు. ఆ తరలింపు శాశ్వత ప్రాతిపదికపై జరుగుతుంది. అందుకోసం అవసరమైతే అమెరికన్ సేనలను నియోగిస్తారు. పాలస్తీనా, ఇజ్రాయెల్ యుద్ధ కారణంగా ఇతర దేశాలకు శరణార్థులుగా వెళ్లి, కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత ఇప్పుడిప్పుడే తిరిగి వస్తున్న గాజా ప్రజలను ఇక రానివ్వరు. ఆ ప్రాంతాన్ని అమెరికా శాశ్వత లేదా దీర్ఘకాలిక ప్రాతిపదికపై స్వాధీనం చేసుకుంటుంది. అక్కడ ప్రస్తుతం గల శిథిలాలను, మందు పాతరలను, ఆయుధాలను తొలగిస్తుంది. తర్వాత గాజాను ఒక మంచి బీచ్ రిసార్టుగా తయారు చేస్తుంది. అక్కడ మంచి వినోద విహారాలతోపాటు చాలా ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయి. పాలస్తీనియన్లు కోరుకున్న పక్షంలో ఇతరులతోపాటు వారు కూడా కొందరుండి పనులు చేసుకోవచ్చు. ఆ విధంగా అందరికీ అది ఒక టూరిజం మక్కా వంటిదవుతుంది. ఉద్యోగాల మక్కాగా మారుతుంది. ఇదంతా ఎవరికైనా నమ్మశక్యంగా తోచకపోతే మరొకసారి చదవండి. ప్రతి మాట ట్రంప్ అన్నదే. అంతా రికార్డు అయిందే. దీనికిదే ఒక విశేషం కాగా, ట్రంప్ ఈ ప్రకటనలను ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ తన సరసన కూర్చుని ఉండగా మరీ చేసారు. ఆయన ట్రంప్ చెప్తున్నది వింటూ చిరునవ్వులు చిందించినట్లు మీడియా రిపోర్టు చేసింది. ట్రంప్ తర్వాత నెతన్యాహూ మాట్లాడుతూ, అమెరికా అధ్యక్షుని పథకం "చరిత్ర గతినే మార్చివేయగల" దన్నారు. ఆ దిశలో ప్రయత్నాలు జరగాలన్నారు. ట్రంప్ జనవరి 20న బాధ్యత స్వీకరించిన తర్వాత అమెరికాకు వెళ్లి తనను కలిసిన మొదటి విదేశ నాయకుడు నెతన్యాహూ. మీడియా సమావేశానికి ముందేవారి మధ్య గాజా భవిష్యత్తుపై చర్చలు జరిగి ఇటువంటి ఏకాభిప్రాయానికి వచ్చి ఉంటారనుకుంటే పొరపాటు ఉండకపోవచ్చు. ఇందుకు సంబంధించి రంగాన్ని సిద్ధం చేసేందుకు కావచ్చు నెతన్యాహూ తన తిరిగి రాకను వాయిదా వేసుకున్నారు. గాజా పట్ల, పాలస్తీనా విషయమై ట్రంప్ వైఖరి క్రమంగా మారుతూ రావటం గురించి కొంత చెప్పుకోవాలి. రిపబ్లికన్లు, డెమొక్రాట్లలో ఎవరు పాలించినా అమెరికా విధానం పాలస్తీనా, ఇజ్రాయెల్ అనే రెండు స్వతంత్ర దేశాల ఏర్పాటుకు అనుకూలంగా ఉంటూ వచ్చింది. ఈ విషయమై మాట్లాడటం తప్ప అమెరికా ఎప్పుడూ చిత్తశుద్ధి చూపకపోవటం నిజమే అయినప్పటికీ కనీసం ఒక విధానంగా ఆ మాట చెప్తూ వస్తున్నది. గాజా, ఇజ్రాయెల్ మధ్య ఇటీవలి కాల్పుల విరమణ ఒప్పందం అమెరికా జోక్యంతోనే జరిగి, గాజా పౌరులు అక్కడకు తిరిగి వెళ్లటం మొదలైంది. బందీల విడుదల సాగుతున్నది. ఒప్పందం జరిగినపుడు రిపబ్లికన్లు అధికారంలో లేకపోయినా, బైడెన్ తీసుకున్న చొరవను ట్రంప్ కూడా బలపరచారు. ఒప్పందంలో మొదటి దశ అమలు సజావుగా జరిగిపోయి, ఇక రెండవ దశ గురించి చర్చలు జరగనుండగా అందుకోసం పాలస్తీనియన్లతోపాటు ప్రపంచమంతా ఎదురుచూస్తున్నది. సరిగా ఆ స్థితిలో ట్రంప్ ఈ విపరీతమైన ప్రకటన చేసారు. అయితే కొని విషయాలు చెప్పుకోవాలి. ఒక విపత్తు సంభవించటానికి ముందు ఒకోసారి కొన్ని ముందస్తు సూచనలు కనిపిస్తాయంటారు. అవి ఒకోసారి నిజంకావచ్చు లేదా కాకపోవచ్చు. అదే పద్ధతిలో గాజా విషయమై ట్రంప్ నుంచి అనుమానించదగిన సూచనలు కొన్ని కనిపిస్తూ వచ్చాయి. యుద్ధం వల్ల గాజా అంతటా శిథిలాలు, ఆయుధాలు నిండిపోయాయని, వాటిని తొలగించి, అవసరమైన నిర్మాణాలు చేపట్టి, తిరిగి నివాసయోగ్యం చేసేందుకు అక్కడి ప్రజలు "తాత్కాలికంగా" ఈజిప్టు, జోర్డాన్ వంటి దేశాలకు తరలివెళ్లటం అవసరం కావచ్చునని మొదట అన్నారు. పునర్నిర్మాణానికి ఎన్ని నిధులు, ఎంత కాలం కావచ్చునో అంచనాలు సంపాదించారు. అందుకోసం తాము సహాయం చేయగలమని, అరబ్ దేశాలు కూడా చేయాలని అన్నారు. ఆ మాట నెతన్యాహూ తోనూ అన్నారో లేదో తెలియదు గాని, ఆయన విడిగా మాట్లాడుతూ తమకు అందులో ఆసక్తి లేదన్నారు. ఆ తర్వాత నుంచి ట్రంప్ వైఖరి క్రమంగా మారటం మొదలైంది. గాజా ప్రజలు స్వల్ప కాలానికి గాక దీర్ఘ కాలానికి వెళ్లటం అని, ఇపుడు 4వ తేదీన శాశ్వతంగా అని వాదించారు. గాజా శరణార్థులు ఇప్పటికే లక్షలాది మంది ఈజిప్టు, జోర్డాన్‌లలో ఉండగా, వారు మరింత మందిని తీసుకోవాలన్నారు. అందుకు వారు నిరాకరించగా, తీసుకు తీరవలసిందేనని, తీసుకోగలరన్న నమ్మకం తమకుందని, అందుకు ఒప్పించగలనని ఇపుడు మాట్లాడుతున్నారు. గాజా పునర్నిర్మాణానికి అరబ్ రాజ్యాలు నిధులివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇతర దేశాలలో గాజా ప్రజలు స్థిరపడేందుకు కూడా ఈ దేశాలు నిధులివ్వాలంటున్నారు. మరొక వైపు, ఇజ్రాయెల్ హత్యాకాండకు నిరసనగా అమెరికాలో ప్రదర్శనలు చేసిన విద్యార్థులను, ఇతరులను స్వదేశాలకు పంపివేయటం మొదలు పెట్టారు. ఈ చర్య వాక్ స్వాతంత్ర్య చట్టాలకు విరుద్ధమనే విమర్శలను లెక్కచేయటం లేదు. గాజాపై ప్రయోగానికి రెండు వేల పౌండ్ల భారీ ఉక్కు గోళాల సరఫరాను బైడెన్ చివరి దశలో నిలిపివేయగా, ఆ చర్యను ట్రంప్ చేసారు. మరొక బిలియన్ డాలర్ల ఆయుధాల అమ్మకానికి ఉత్తర్వు చేసారు. గాజాలో చెక్ పోస్టుల నిర్వహణకు అమెరికన్ ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీని నియమించారు. ఇవన్నీ ఇంతగా పేర్కొనటం ఎందుకంటే, పూర్తిగా ఇజ్రాయెల్ అనుకూలుడు, పాలస్తీనా వ్యతిరేకి అనే పేరు గతం నుంచీ ఉండి, ప్రస్తుత యుద్ధకాలమంతా అదే వైఖరి చూసిన ఆయన, ఆ సమస్యను పరిష్కరించ గలనంటూ అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలో కొంత నటించారు. రెండు దేశాల సూత్రమంటూ కూడా మాట్లాడారు. అటువంటిది, బాధ్యతలు స్వీకరించిన సరిగా రెండు వారాలకు అంతా తలకిందులు చేసారు. ఆయన చెప్పినవన్నీ స్వయంగా అమెరికా విధానాలతో పాటు, ఐక్యరాజ్య సమితి తీర్మానాలకు, జెనీవా కన్వెన్షన్ (ఏ పౌరులను కూడా బలవంతంగా మరొక చోటికి తరలించరాదన్నది) తో సహా అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమైనవి. ట్రంప్ ప్రకటన తర్వాత అమెరికన్ పత్రికలలో వెలువడుతున్న కథనాలను బట్టి చూడగా, స్వయంగా రియల్ ఎస్టేట్ వ్యాపారి అయిన ఆయన, మరికొందరు వ్యాపారులతో కలిసి ఈ పథకం వేసినట్టు అర్థమవుతున్నది. పాలస్తీనాలో రెండవ భాగమైన వెస్ట్ బ్యాంక్ పరిస్థితిని కూడా ఇక్కడ చూడాలి. రెండు భాగాలనూ ఆక్రమించుకుని ఇజ్రాయెల్‌లో విలీనం చేయాలన్నది నెతన్యాహూతో పాటు ఇజ్రాయెల్‌లోని తీవ్ర జాతీయవాద జియోనిస్టు పార్టీల ఆలోచన. ఆ ప్రకారం ప్రస్తుత యుద్ధాన్ని అనువుగా చేసుకుంటూ గాజాలో వీలైనంత మందిని హతమార్చి తక్కిన వారిని అక్కడి నుంచి తరిమివేయగలమంటూ ఈ వర్గాలు గతం నుంచే చెప్తున్నాయి. ఇక వెస్ట్ బ్యాంక్ అంటూ ప్రత్యేకంగా ఏమీ లేదని, అది ఇజ్రాయెల్‌లో అంతర్భాగమని కూడా వాదిస్తున్నారు. ఇందుకు ట్రంప్ మద్దతు తన మొదటిపాలనా కాలం నుంచి ఉంది. అందుకే, ఇజ్రాయెల్ తన రాజధానిని టెల్‌అవీల్ నుంచి వెస్ట్ బ్యాంక్‌లోని జెరూసలేంకు మార్చగా, ఐక్యరాజ్య సమితితో సహా తక్కిన ప్రపంచమంతా తిరస్కరించినా ట్రంప్ ప్రభుత్వం అపుడు గుర్తించింది. ఇపుడు తాజాగా ట్రంప్ తన సమితి రాయబారిగా నియమించిన ఎలీజ్ స్టెఫానిక్, ఇజ్రాయెల్‌కు వెస్ట్‌బ్యాంక్‌పై బైబిల్ కాలం నుంచి హక్కులున్నాయంటూ వాదించింది. ఈ 4వ తేదీ నాటి మీడియా సమావేశంలో వెస్ట్‌బ్యాంక్ గురించి ప్రస్తావించక పోవటానికి అర్థం ఏమై ఉంటుంది? గాజాను అమెరికా, వెస్ట్ బ్యాంక్‌ను ఇజ్రాయెల్ ఆక్రమించటమే వారి ఉమ్మడి వ్యూహమని భావించకుండా ఉండగలమా? పైగా, వెస్ట్ బ్యాంక్‌లో అంతర్జాతీయ చట్టాలకు, సమితి తీర్మానాలకు విరుద్ధంగా ఇప్పటికే 70,000 మందికి పైగా యూదు సెటిలర్లను స్థిరపరచారు. వారి కాలనీలు ఇంకా విస్తరిస్తున్నాయి. అక్కడి సెటిలర్లు ఇజ్రాయెలీ సేనల మద్దతుతో సాగించని అత్యాచారాలు లేవు. పాలస్తీనియన్లకు ఎవరి నుంచి ఏ రక్షణా లేదు. పాలస్తీనియన్లతో నామమాత్రంగా నడిచే పాలస్తీనా అథారిటీ ప్రభుత్వం (అరాఫాత్ స్థాపించిన పిఎల్ఓ పార్టీ ప్రభుత్వపు అవశేషం), అమెరికా, ఇజ్రాయెల్‌ల కీలుబొమ్మగా మారింది. పూర్తి అసమర్థత, అవినీతితో కనీసం గాజా మారణకాండను ఖండించలేని దుస్థితిలో మిగిలి ఉంది. అయినప్పటికీ, గాజాలో హమాస్ అంతమైతే అక్కడ కూడా పాలించాలనే ఉత్సాహం చూపుతున్నది. ఆ మేరకు అమెరికా, యూరప్‌తో పాటు, హమాస్ మిలిటెన్సీ అంటే సరిపడని అరబ్ దేశాల మద్దతు కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నది. ఈ పరిస్థితుల మధ్య ఇపుడు ఉన్నట్లుండి ట్రంప్ తన కొత్త పథకాన్ని ముందుకు తెచ్చారు. అది చతురోపాయాల ద్వారా అమలుకు వచ్చిన పక్షంలో అందుకు పర్యవసానంగా ఇక గాజా, వెస్ట్ బ్యాంక్‌లతో సహా అసలు పాలస్తీనా అనేదీ ఉండదు. ఇటువంటి ప్రతిపాదనను ఇంత బాహాటంగా అమెరికన్ అధ్యక్షులెవరూ చేయలేదు. ట్రంప్ వ్యూహంలో ఒక భాగం, మధ్యధరా సముద్ర తీరాన గల గాజాలో తమ సైనిక, వైమానిక స్థావరాలను ఏర్పాటు చేయటం కూడానని అర్థమవుతూనే ఉన్నది. ఆయన ఆలోచనను హమాస్, పాలస్తీనా అథారిటీ, హెజ్బొల్లాతోపాటు అరబ్ దేశాలు, రష్యా, చైనాలే గాక జర్మనీ, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, టర్కీ వంటి నాటో దేశాలు కూడా వెంటనే తిరస్కరించాయి. అమెరికన్ సెనేటరలో డెమొక్రాట్లతో పాటు కొందరు రిపబ్లికన్లు సైతం ఖండించటం విశేషం. ఐక్యరాజ్య సమితి ఇది ఎంతమాత్రం తగని ఆలోచన అన్నది. పాలస్తీనా స్వతంత్ర దేశంగా ఏర్పడనంత వరకు తాము ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాలు నెలకొల్పు కొనబోమని సౌదీ అరేబియా మరొక మారు స్పష్టం చేసింది. అయినా అరబ్ దేశాలకు తాను నచ్చజెప్పగలనంటూ ఒక విలేఖరికి సమాధానమిచ్చారు ట్రంప్. వివిధ పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్నపుడు, ఆయన ఆలోచనలు నెరవేరే అవకాశం కనిపించటం లేదు. అయినప్పటికీ అటువంటి పథకం వేయటమన్నదే ఎంత దుర్మార్గమైనదో చెప్పనక్కరలేదు. తమ దేశం కోసం 76 సంవత్సరాలుగా రక్త తర్పణలు చేస్తున్న పాలస్తీనీయన్లు ఇందుకు ఎట్టి పరిస్థితులలోను అంగీకరించరు.

# ప్రజాస్వామ్య ఎన్నికల్లో ఫలితాల తారుమారు....?

మొదటి పేజీ తరువాయి

మానసికంగా వేధింపులకు గురి చేయడమే కాకుండా ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోగొట్టే విధంగా కఠినాతి కఠినంగా శిక్షిస్తూ ఏకంగా జైలుకు పంపిన సంఘటనలు దేశాన్ని కుదేలు చేశాయన్నారు. మోడీ ప్రభంజనం విజృంభించిందని కొన్నిచోట్ల ప్రచారాలు సాగుతుండగా మరికొన్ని చోట్లనైతే మోడీపై నమ్మకంతో ప్రజలు ఓట్లేసారని తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాజకీయ నాయకులు విశ్లేషణాత్మకంగా మాట్లాడుతుండడం పట్ల సిగ్గేస్తుందన్నారు అలాంటి ప్రభంజనమైతే పది సంవత్సరాల్లో భారతదేశ పరిపాలన ఇంత వెనుకబాటుకు కారణం ఏమైందో నాయకుల గుండె మీద చేయి వేసుకొని చెప్పాలన్నారు. ఢిల్లీ ప్రజలు అభివృద్ధి కోసం ఓటేశారని ప్రగల్భాలు పలుకుతున్న నాయకులను తీవ్రంగా విమర్శించారు. ఢిల్లీ ఎన్నికల పోలింగ్ ముందు రోజు ఆప్ ఎమ్మెల్యేలు మారడం దేశ ప్రజలు గమనించటం లేదనుకోవడం పొరపాటన్నారు. ఎన్నికల అనంతరం ఆప్ మంత్రి ఓటమి సంబరాల్లో డాన్సులు వేయడం దేనికి నిదర్శనమో ప్రజలు గమనించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జగన్ రెడ్డిని ఓడించడానికి మిత్రపక్షాల కూటమి అంటూ అందరూ ఏకమై ఒంటరి చేసినప్పటికీ వైఎస్ఆర్సిపి పార్టీకి వచ్చిన ఓట్లలో కూటమికి వచ్చిన ఓట్ల శాతం కేవలం ఒకటి నుండి రెండు శాతాల మార్పు వ్యత్యాసం ఉన్నప్పుడు 164 సీట్లు కూటమికి రావడం ఏంటి 11 సీట్లు వైఎస్ఆర్సిపికి రావడమేంటంటూ నిశ్శబ్దమైన ఆశ్చర్యం వ్యక్తంచేశారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో జరుగుతున్న సాంకేతిక ఎన్నికల నిర్మాణం ఉన్నత, అత్యున్నత న్యాయస్థానాల్లో పనిచేస్తున్న న్యాయ నిపుణులకే అంతుచిక్కడం లేదనడానికి నిదర్శనంగా ఈ మధ్యకాలంలో సుమారు100 మంది న్యాయవాదులు రహస్యంగా ఏకాంతంగా సమావేశం ఏర్పరచుకొని చర్చించుకున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతుందన్నారు. ఈవీఎంలపై అనుమానం వ్యక్తం అవుతున్న వేల దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికల రూపకల్పనకు శ్రీకారం చుట్టారన్నారు. మోడీ ప్రభంజనం మాట అటు పెడితే ఎమ్మెల్యేలను ఎందుకు కొన్నారో ఢిల్లీ ప్రజలకు తెలపాలన్నారు. ప్రతి రాష్ట్రంలో రాజకీయాల్లో పెను మార్పులను సృష్టిస్తున్నది ప్రతిపక్షాలను కూలదోయడానికేనా అంటూ గతంలో బిజెపి ప్రభుత్వం బిజెపి ఇతర రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూల్చివేసి ఐదు సంవత్సరాల పాటు రాజ్యాంగబద్ధంగా ఎన్నిక కాబడిన ప్రభుత్వాలను మధ్యస్థంగా పడగొట్టి ప్రభుత్వ ఏర్పరచుకోవడం గమనించ బద్ధులమై ఉన్నామన్నారు. ఐదు సంవత్సరాలు నిలబడాల్సిన ప్రభుత్వాలు మధ్యలో ఎందుకు కూల్చబడుతున్నాయో దేశ ప్రజలు గమనించలేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. జపం చేస్తే చాలు జారిపోయిన పదవులు సైతం కూడబెట్టబడతాయి అనడానికి అసాంకేతికమైన ఎన్నికల నియమవవలె నిదర్శనం అన్నారు. ఆంధ్ర ఎన్నికల్లో జగన్ రెడ్డిని వైఎస్ఆర్సిపి పార్టీని కూల్చడానికి వాడిన సాంకేతిక పరిజ్ఞాన పరికరం ఏంటంటూ ఆంధ్ర ప్రజలు ప్రశ్నిస్తున్నారనేది మరువలేనిదైతే అంతా ఒక్కటై కూల్చేద్దామనే నినాదం బలపడుతుండడానికి ఆంధ్ర ఎన్నికలే ప్రత్యక్ష కారణమన్నన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ముందు ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తే మాట్లాడని రాజకీయ నాయకులు ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీకి గుండు సున్నా అంటూ గాబర పడుతున్నారన్నారు. ముందస్తుగా పక్కా ప్రణాళికలతో ఆప్ పార్టీని ఓడించడానికి అన్ని రకాల శక్తి యుక్తుల్ని వాడినట్లుగా రాజకీయ పరిణామాలు తెలియజేస్తున్నాయన్నారు. ఢిల్లీలో జరిగిన ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్ష పార్టీలైన బిజెపి, కాంగ్రెస్ పార్టీలు పొత్తులు పెట్టుకోకుండా వ్యక్తిగతంగా బరిలోకి దిగడంతో ఆప్ ఓటు బ్యాంకింగ్ ను కాంగ్రెస్ పార్టీ చెదరగొట్టడం వల్ల బిజెపికి లబ్ధి చేకూరిందని నిపుణులు మేధావులు రాజకీయ పండితులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారన్నారు. అలా కానప్పుడు 22 సీట్లు ఆఫ్ పార్టీకి ఒంటరిగా రావడం గొప్పతనమే కదా అంటూ అభివర్ణించారు. ప్రజాస్వామ్యం విలువలకు కట్టుబడి పని చేయాలంటే రాజకీయ నాయకుల్లో నిజాయితీ ఉండాలని ఆస్తుల సంపాదనకు అత్యాశ కనపరచకుండా నిబద్ధతతో ప్రజల కోసం పనిచేయగలగాలన్నారు. భారతదేశవ్యాప్తంగా ఎలాంటి రాజకీయ పదవి లేకుండా కోట్ల కుటుంబాలకు మేలుచేసి ఆదుకొని జీవనాన్నిచ్చిన దివంగత పారిశ్రామిక వ్యాపారవేత్త రతన్ టాటాను అద్భుతమైన ఉదాహరణగా తీసుకోవాలన్నారు. లక్షల కోట్ల రూపాయలు వెనుకేసుకొని నిజాయితీ మాటలు మాట్లాడడం ఏ రాజకీయ నాయకునికైనా తగదన్నారు. భారతదేశ రాజకీయాల్లో అప్పులు పెరుగుతున్నప్పటికీ అభివృద్ధి జరగకపోవడం నిరాశను మిగిల్చిందన్నారు. లక్షల కోట్ల ఎఫ్డీలు పేద ప్రజల కోసం పొందుపరిచిన రతన్ టాటా ను ఎంత గౌరవించిన తక్కువేనన్నారు. అసాంకేతికమైన ఎన్నికల నియమావళిలో జరిగిన సంఘటనల దృష్ట్యా కొన్ని రాష్ట్రాల్లో నైతే ఈవీఎంలు దొంగిలించబడ్డాయి అంటూ, వాహనాలు మార్చబడిన అంటూ ఎన్నికల అనంతరం పలు వార్తలను మాధ్యమాల్లో చూసిన సంఘటనలు అనేకం కలవన్నారు. సుప్రీం కోర్ట్ ఎన్నికల నిర్మాణానికి ఈవీఎంలపై వెలువరించిన ఉత్తర్వులలో ప్రతి ఈవీఎంకు బ్యాలెట్ ఓటు నమోదును జతపరచమని ఆజ్ఞలు ఇచ్చినప్పటికీ కొన్ని రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికలలోనైతే ఈవీఎంలలోని బ్యాలెట్ పత్రాలు చెత్తకుప్పలలో తగలెయ్యబడడాన్ని గమనించలేకపోతున్నామన్నారు. దీన్నంతటిని బట్టి అధికారం ఉంటే ఏం చేసినా అడిగే నాథుడే ఉండదు అనే విధంగా దేశ రాజకీయాలు కొనసాగుతుండడం భారతదేశ భవిష్యత్తును ఎటువైపు నడిపిస్తాయో వేచి చూడాలన్నారు. ప్రతిపక్ష పార్టీలను ఆయా రాష్ట్రాలలో ఏర్పడ్డ ప్రభుత్వాలను కులదొస్తామంటూ మంచోడు చెడ్డోడు ఉన్నోడు లేనోడు రాజకీయ పరిజ్ఞానం ఉన్నోడు పరిజ్ఞానం లేనోడు విచ్చలవిడి దుష్ప్రచారం చేస్తుండడం ప్రజాసేవా....అంటూ ప్రశ్నించారు. కక్షపూరితమైన రాజకీయాలకు తెరదించే విధంగా అత్యున్నత న్యాయస్థానాలు నూతన చట్టాలను తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఏ ఎన్నికలలోనైనా సామాన్య ప్రజలు వేస్తున్న ఓటుపట్ల నమ్మకం లేకుండా పోతుందన్నారు. ప్రభుత్వాలు ఏర్పడడం ఎంత ప్రాముఖ్యమో ప్రజలకు సేవ చేయడం అంతే ప్రాముఖ్యమన్నారు. దేశ రాజకీయాలను మార్చగల యువత ప్రజాస్వామ్య ఎన్నికల పట్ల అవగాహన కోల్పోతుండడం దేశవ్యాప్తంగా జరుగుతున్న ఎన్నికల తారుమారుకు మూల కారణమన్నారు. ప్రజాసేవ చేయలేని ఏ నాయకులైన స్వతహాగా రాజకీయాల నుండి తప్పుకొని దేశ ప్రగతికి మేలు చేయాలన్నారు. ఓటమిల నుండి పుట్టుకొచ్చే విజయాలు నిజాయితీగా పనిచేయగలమన్నారు. జాతీయ పార్టీలకు ప్రాంతీయ పార్టీలకు విభిన్నమైన రాజకీయ వ్యత్యాస బాధ్యతలు ఉంటాయంటూ గుర్తుచేశారు. కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వ వ్యతిరేక ప్రతిపక్ష నాయకులు అధికారం కోల్పోగానే కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీలతో అంతర్గతంగా మమేకమైపోవడం సహజంగా పసిగట్టాల్సిన ప్రధాన అంశమన్నారు. యువత రాజకీయ పరిజ్ఞానాన్ని అలవర్చుకోవడంలో సొంత విద్యాభ్యాసంలో ఎంతైత నైపుణ్యతను ప్రదర్శిస్తున్నారో అంతే నైపుణ్యతను రాజకీయ పరిణామాలను అనువదింప చేసుకోవడానికి ఉపయోగించాలన్నారు. భారతదేశ ప్రస్తుత అప్పులు దేశ అభివృద్ధిని మెరుగు పరచలేకపోతున్నాయడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. కాలక్రమేన రాజకీయ పార్టీల బలాబలాలను బేరీజు వేసుకుంటూ ముందుకు సాగుతున్నారు తప్ప విశ్వాసంతో రాజకీయ బిక్ష పెట్టిన ప్రజలను ఆదుకోవడం మర్చిపోతున్నారన్నారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా దేశంలో నరహత్యలు, దైవభక్తుల పేర్ల మీద మంత్రాలు, మాయలు, ఫార్మసీలకు సంబంధించిన డ్రగ్స్ వ్యాపకాలలో శరీర జబ్బులను తగ్గించేవి శరీర జబ్బులను పెంచేవి, దొంగతనాలు, సంపదనలు దోచుకోవడం లాంటివి ఏ స్థాయిలో పెరిగిపోతున్నాయో దేశ ప్రజలందరూ అత్యంత జాగ్రత్తగా పసిగట్టాలని ప్రత్యేకించి తెలిపారు.

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత




**హైద్రాబాద్ జై భీమ్ న్యూస్**

కొల్లూరు ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ వద్ద అక్రమంగా లారీలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. రాజేంద్రనగర్ నుంచి ముంబైకి రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పక్క సమాచారంతో పోలీసులు పట్టుకున్నారు. 24 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని లారీని సీజ్ చేశారు. కేసు నమోదు చేసి కొల్లూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## కాళేశ్వర ముక్తేశ్వరుడికి నేడు మహా కుంభాభిషేకం

**పాల్గొన్న మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్ బాబు**

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా జై భీమ్ న్యూస్**

కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శ్రీ శ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామి ఆధ్వర్యంలో మహా కుంభాభిషేకం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తుని తపోవన పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామి చేతుల మీదుగా ఈ మహకుంభా భిషేకం పూజలు ఘనంగా జరుగాయి. ఈ సందర్భంగా ప్రధాన ఆలయం, అనుబంధ ఆలయాలు, రాజగోపురాల కలశాల సంప్రోక్షణ పూజలు, మహాకుంభాభిషేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో తెలంగాణ రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రి పొన్నం ప్రభాకర్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ పాల్గొన్నారు. ముందుగా స్వామివారి దర్శనానికి వచ్చిన మంత్రులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణ మండపం వద్ద పీఠాధిపతికి స్వామివారి శేష వస్త్రాలు అందజేశారు. ఈ సంద ర్భంగా తుని పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామి అనుగ్రహభాషణం అందించారు. భక్తులందరికీ స్వామివారి ఆశీస్సులు ఉంటాయని, కాళేశ్వర స్వామి దర్శనం ముక్తి క్షేత్రంగా ప్రసిద్ధి పొందిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, ఆర్జేసి రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ పార్టీ భస్మాసుర హస్తమే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ పరాజయానికి కారణం

**ఎమ్మెల్సీ కవిత, కేజ్రీవాల్ ల లిక్కర్ స్కాం ఆమ్ ఆద్మీ పార్టీని ఢిల్లీ ప్రజలకు దూరం చేసింది**

**ఢిల్లీ అసెంబ్లీ ఫలితాలనుద్దేశించి రాహుల్ గాంధీ పై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు అహంకారపూరితమైనవి**

**ఈ అహంకారాన్ని అణచివేసేందుకే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు బిఆర్ఎస్ కు బుద్ధి చెప్పారు**

**అధికార పక్షమైన, ప్రతిపక్షమైనా కాంగ్రెస్ పార్టీది ఎప్పుడూ పోరాట పంథానే**

**కాంగ్రెస్ పార్టీ పరమోన్నత లక్ష్యం ప్రజా సంక్షేమమే**

హైద్రాబాద్ జై భీమ్ న్యూస్

బిఆర్ఎస్ పార్టీ భస్మాసుర హస్తం ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీని నిండా ముంచిందని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు శ్రీమతి కొండా సురేఖ అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల పై మంత్రి కొండా సురేఖ స్పందించారు. మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవితతో కేజ్రీవాల్ లిక్కర్ వ్యాపారం ఆమ్ ఆద్మీ పార్టీని ప్రజలకు దూరం చేసిందని మంత్రి సురేఖ పేర్కొన్నారు. ఫలితంగానే అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ చతికిలపడిందని తెలిపారు. రాష్ట్రాన్ని అగాథంలోకి నెట్టిన బిఆర్ఎస్ పార్టీ, ఆ పార్టీ నాయకులు దేశంలోని మిగతా పార్టీలను భ్రష్టు పట్టిస్తూ బిజెపిని నిలబెడుతున్నారని ప్రజలు అనుమానిస్తున్నారని మంత్రి తెలిపారు. లిక్కర్ స్కాంతో ఆప్ ప్రభుత్వం, కేజ్రీవాల్ పై వ్యతిరేకతే ఆప్ పరాజయానికి దారితీసిందన్న ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నా హజారే వ్యాఖ్యల్ని మంత్రి సురేఖ గుర్తు చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ కాంగ్రెస్ పార్టీతో కలిసి నడిస్తే అసెంబ్లీ ఎన్నికల ఫలితం మరోలా వుండేదని మంత్రి సురేఖ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, ఆప్ విడివిడిగా పోటీ చేయడం వల్ల బిజెపి పార్టీకి మేలు జరిగిందని అన్నారు. కేజ్రీవాల్ వ్యూహాత్మక తప్పిదాలే బిజెపికి కలిసి వచ్చాయని మంత్రి సురేఖ తేల్చి చెప్పారు. ఈ ఫలితాలన్నింటికి కేజ్రీవాల్ స్వయంకృపారాదమే కారణమని పేర్కొన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల పై రాహుల్ గాంధీని ఉద్దేశిస్తూ కెటిఆర్ చేసిన వ్యాఖ్యలు అహంకారపూరితమైనవని మంత్రి సురేఖ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అహంకారమే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ ఓటమికి, పార్లమెంటు ఎన్నికల్లో సున్నా సీట్లకు పరిమితమవడానికి కారణమైందని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. పోరాటానికి ప్రత్యామ్నాయ పదమే కాంగ్రెస్ పార్టీ అని మంత్రి సురేఖ అన్నారు. గెలుపోటములు కాంగ్రెస్ పార్టీకి కొత్త కాదని, అధికార పక్షమైన, ప్రతిపక్షమైన నిత్యం ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ పోరాట పంథాను వీడదని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడానికి కూడా భయపడే బిఆర్ఎస్ పార్టీ గెలుపోటములు గురించి మాట్లాడటం విడ్డూరంగా వున్నదని మంత్రి అన్నారు. ప్రజల ఆదరణతో కాంగ్రెస్ పార్టీ పునర్వైభవం సాధిస్తుందని మంత్రి సురేఖ ధీమా వ్యక్తం చేశారు.

# సెరెన్ ఏరోసిటి బ్రోచర్ ఆవిష్కరణ

**కాజీపేట ఖమ్మం బైపాస్ హై వే ప్రధాన రహదారిలో ప్రారంభమైన నూతన వెంచర్**

**అధునాతన సాంకేతిక పద్ధతిలో అభివృద్ధితో రూపుదిద్దుకొంటున్న నూతన వెంచర్**

**గ్రేటర్ వరంగల్ మున్సిపల్, రేరా అనుమతులతో...**

**గేటెడ్ కమ్యూనిటీ తరహాలో ప్రతి ప్లాటుకు రక్షణ వెంచర్ కల్పిస్తున్న కల్పిస్తున్నాం**

**ఎక్కడ సందేహం లేదు ఏ కోసనా మోసం లేదు**

**ఇన్వెస్ట్మెంట్ మీ నమ్మకం అయితే భరోసా మా బాధ్యత**

**వరంగల్ లో సినీగేయ రచయిత ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్, హిరోయిన్ ప్రియా హెగ్డేల సందడి**






హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్

వరంగల్ మహానగరంలో మడికొండ కాజిపేట్ వరంగల్ ప్రాంతాలను అభివృద్ధి పరిచే విధంగా నూతనంగా ఆరంభమైన సెరెన్ ఏరోసిటి ఆదివారం ఉదయం అంగరంగ వైభవంగా ఆరంభమైంది. ప్రముఖ సినీ గేయ రచయిత ఉమ్మడి వరంగల్ జిల్లా ముద్దుబిడ్డ ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్, హిరోయిన్ ప్రియా హెగ్డేల చేతుల మీదుగా వెంచర్ ఆరంభం జరిగినట్లు చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కే బాబు ఆగస్టస్ తెలిపారు. గ్రేటర్ మున్సిపల్ కార్యాలయాల అనుమతులతో ఏర్పడిన సెరెన్ ఏరోసిటి వెంచర్ ప్లాట్ల విశిష్టతను చైర్మన్ వివరిస్తూ వెంచర్ లో ప్రతి ప్లాటును నిర్దిష్ట పరిధిలో ఉంచడం విశేషం అన్నారు. భూమి కొనుగోలు చేసుకోవడం యాజమాన్య హక్కులు పొందడం కుటుంబ సభ్యుల ఆధార్ పాన్ కార్డ్ ప్రాధాన్యతకు సరి సమానంగా హక్కులు కల్పించబడేలా వెంచర్ ప్రాధాన్యత కల్పించబడుతుందని హామీ ఇచ్చారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి మూడు కిలోమీటర్ల దూరంలో, మడికొండ ఐటి హబ్ కు ఆరు కిలోమీటర్ల దూరంలో, మామునూర్ ఎయిర్పోర్ట్ కు 12 కిలోమీటర్ల దూరంలో, కాజీపేట రైల్వే జంక్షన్ కి 5 కిలోమీటర్ల దూరంలో, ఎన్ఐటి వరంగల్ కి ఆరు కిలోమీటర్ దూరంలో స్థాపించబడిన నూతన వెంచర్ పై కస్టమర్లలో ఆసక్తి పెరుగుతుండ డం వెంచర్ వెంచర్ నిజాయితీ బాధ్యతను పెంచుతున్నాయన్నారు. మొదటి రోజే 23 ఫ్లాట్స్ కొనుగోలు కోసం అగ్రిమెంట్ రూపంలో నమోదు కావడం వెంచర్ విశిష్టత అన్నారు. ఇన్వెస్ట్మెంట్ మీ నమ్మకం అయితే ప్లాట్ల బాధ్యత, ప్లాట్ల భద్రత వెంచర్ కి యజమానుల బాధ్యత అంటూ నమ్మకం కలిగేలా వివరించారు. ఉద్దేశ పూర్వకంగా కాకుండా సహజ సిద్ధమైన ఆలోచనలతో నమ్మకంతో విశ్వాసంతో వెంచర్ నిర్మాణానికి సహకారంగా నిలుస్తూ ప్లాట్ల క్రయవిక్రయాలలో నమ్మకంతో పాల్గొని సహకారాన్ని అందించాలని కస్టమర్లకు విజ్ఞప్తి చేశారు. అనంతరం తెలంగాణ మార్కెటింగ్ హెడ్ అశోక్ బెల్లంకొండ, వరంగల్ ఉమ్మడి జిల్లా మార్కెటింగ్ హెడ్ విద్యాసాగర్ కాందారిలు మాట్లాడుతూ కస్టమర్ దేవుళ్ళకు ఎప్పుడు అనుకూలంగా వుంటూ అందరి మన్ననలను పొందుతూ అభివృద్ధి కోసం పాటుపడతామని, భూమి కొనాలని వున్న ప్రతి కస్టమర్ కావలసిన సపోర్టు వుంటుందని, ఈ వెంచర్ లో కొన్నవారికి బ్యాంక్ లోన్ కూడా అందుబాటులో వుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ డైరెక్టర్లు ఎస్ వీరారెడ్డి, పల్లె రవీందర్, అసోసియేట్స్, కస్టమర్స్ తదితరులు పాల్గొన్నారు.

# చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దుండగులు దాడి

**దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు**

**దాదాపు 20మంది దాడి చేశారన్న అర్చకులు**

**రెండు రోజుల తర్వాత వెలుగులోకి ఘటన**

హైద్రాబాద్ జై భీమ్ న్యూస్

చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకులు రంగరాజన్ పై ఇంటిపై దాడికి పాల్పడ్డారు. వీర రాఘవ రెడ్డి అనే వ్యక్తి తన అనుచరులతో కలిసి వచ్చి దాడి చేశారు. ఇంట్లోకి చొరబడి తన అనుచరులతో కలిసి విచక్షణ హంగామా చేశాడు వీర రాఘవరెడ్డి. దీంతో ఈ ఘటనపై అర్చకులు రంగరాజన్ మొయినాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో.. నిందితుడు వీర రాఘవరెడ్డిని ఎస్వోటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా.. మూడు రోజుల క్రితం తెల్లవారు జామున వీర రాఘవరెడ్డి అనుచరులు అర్చకులు ఇంట్లోకి చొరబడ్డారు. అంతేకాకుండా.. రంగరాజన్‌పై దూషిస్తూ హల్చల్ చేశారు.కాగా.. ఆలయం సమీపంలోని రంగరాజన్ నివాసానికి శుక్రవారం నాడు కొంత మంది వ్యక్తులు వచ్చారు. రామరాజ్య స్థాపనకు మద్దతు ఇవ్వాలని కోరారు. అందుకు రంగరాజన్ నిరాకరించారు. రామరాజ్యం పేరుతో వచ్చిన వ్యక్తుల మాట నిరాకరించినందుకు తమ కుమారుడిని తీవ్రంగా హింసించారని.. తనపైనా దాడి చేశారు. ఈ దాడికి పాల్పడిన వారితో పాటు పరోక్షంగా వారికి సహకరించిన వ్యక్తులను కూడా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చిలుకూరు బాలాజీ ఆలయ మేనేజింగ్ కమిటీ చైర్మన్ ఎంవీ సౌందర్ రాజన్ ఫిర్యాదు చేశారు.

**చిలుకూరు బాలాజీ అర్చకుడిపై దాడి చేసిన వ్యక్తి అరెస్ట్..**

చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్ పై దాడి చేసిన వీర రాఘవరెడ్డిని అరెస్ట్ చేసిన మొయినాబాద్ పోలీసులు, దీంతో రంగంలోకి దిగిన పోలీసులు వీరరాఘవరెడ్డిని అరెస్టు చేశారు. మిగతా వారి కోసం గాలిస్తున్నారు.

# నేడు జరిగే ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమం రద్దు

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

వరంగల్ జిల్లా జై భీమ్ న్యూస్



నేడు వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తెలంగాణ లెజిస్లేటివ్ కౌన్సిల్ (ఎంఎల్సి) టీచర్ కన్సిట్యూన్సీ ఎన్నికలు, పరిపాలన పరమైన కారణాల దృష్ట్యా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఇట్టి విషయాన్ని గమనించి జిల్లా నలుమూలల నుండి ప్రజలు ఫిర్యాదులు ఇచ్చుటకు కలెక్టరేట్ కార్యాలయానికి రావద్దని, కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

# తల్లితో సహజీవనం చేస్తూ ఆమె కూతుళ్లపై అత్యాచారం చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు

**ఉపాధ్యాయుడికి హెచ్ఐవీ సోకడంతో తమపై జరుగుతున్న అకృత్యాలను తల్లికి చెప్పిన యువతులు.**

హైద్రాబాద్ జై భీమ్ న్యూస్



సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన జాటోత్ సునీల్ కుమార్ స్థానిక హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు.. అయితే భార్య చనిపోవడంతో మరో మహిళతో 2018 నుండి సహజీవనం చేస్తున్నాడు. సదరు మహిళకు 19, 15 ఏళ్ల వయసున్న ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వారు కూడా తల్లితో పాటే ఉంటున్నారు. ఈ క్రమంలో తల్లితో సహజీవనం చేస్తూ తండ్రి స్థానంలో ఉన్న ఆ ఉపాధ్యాయుడు తల్లి లేని సమయంలో మైనర్ బాలికలపై అత్యాచారం చేశాడు. తల్లితో చెబితే చంపేస్తానని బెదిరించి, బాలికలపై పదేపదే అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇటీవల ఆ ప్రబుద్ధుడు వైద్య పరీక్షలు చేయించుకోగా హెచ్ఐవీ సోకినట్లు తేలింది.. ఈ విషయం తెలిసి బాలికలు ఆందోళన చెంది తల్లికి విషయం చెప్పారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లికూతుర్లు. దీంతో పోలీసులు అతడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

# వాకర్స్ ఇంటర్నేషనల్ 303 వరంగల్ కేబినెట్ జాయింట్ సెక్రెటరీగా డాక్టర్ నల్లాని శ్రీనివాస్ ఎన్నిక




హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్

వాకర్స్ ఇంటర్నేషనల్ 303 19 జిల్లాల కేబినెట్ జాయింట్ సెక్రెటరీగా డాక్టర్ నల్లాని శ్రీనివాస్ నియామకం ఈ రోజు 19 జిల్లాల కేబినెట్ ప్రమాణ స్వీకారోత్సవం టి.టి.డి కళ్యాణ మండపము హనుమకొండలో జరిగింది. ఈ డిస్టిక్ క్యాబినెట్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు ఎం. భారతి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ చీఫ్ కో ఆర్డినేటర్స్ దేశిని లక్ష్మీనారాయణ, తటక కుమార్ స్వామి, కూరాకుల భారతి వాకర్ ఇంటర్నేషనల్ 303 వరంగల్ గవర్నర్, వాకర్స్ ఇంటర్నేషనల్ 303,19 జిల్లాల పరిధిలోని వాకర్స్ సంఘాల కార్యవర్గ ప్రతినిధులు, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

# హెడ్ కానిస్టేబుల్‌ను సత్కరించిన వరంగల్ ఏసిపి నందిరాం నాయక్

వరంగల్ జై భీమ్ క్రైమ్ న్యూస్

వరంగల్ పోచమ్మ మైదానం సమీపంలోని శివ సాయి మందిరం అర్చకుడి హత్య కేసుకు సంబంధించిన సాక్షులను, సాక్షాలను సమయ స్ఫూర్తితో న్యాయస్థానంలో ప్రవేశపెట్టి అత్యంత కీలకమైన పాత్ర పోషించిన హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ ను ఆదివారం రోజున వరంగల్ ఏసిపి నందిరాం నాయక్ శాలువాతో సత్కరించి అభినందించారు. సామాన్య ప్రజలకి పోలీసు వ్యవస్థపై నమ్మకం కలిగించే విధంగా ఈ కేసు దర్యాప్తు నిర్వహించి న్యాయ స్థానం ఇచ్చిన ప్రతిష్టాత్మక తీర్పుకు కృషిచేసిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా ఏసీపి నందిరాం అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మట్టేవాడ సిఐ గోపి, మిల్స్ కాలనీ సీఐ వెంకటరత్నం ఎస్సైలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



జై భీమ్ POWER OF PEOPLE

## మనవడి చేతిలో హత్యకు గురైన హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త

**హంతకుడు డ్రగ్స్ మత్తులో ఉన్నట్లు నిర్ధారించిన పోలీసులు**

హైద్రాబాద్ జై భీమ్ న్యూస్

ఆస్తి గొడవల కారణంగా ప్రముఖ పారిశ్రామికవేత్త, వెల్జాన్ గ్రూపు సంస్థల అధినేత వెలమాటి చంద్రశేఖర జనార్ధనరావు(86) తన మనవడి చేతిలో దారుణ హత్యకు గురయ్యారు. సొంత మనవడే ఆస్తికోసం చంద్రశేఖర్‌ని హత్య చేసినట్లు పంజాగుట్ట పోలీసులు తెలిపారు. పోలీసులు మీడియాకు వివరాలు వెల్లడించారు. ఆస్తికోసం గత కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ క్రమంలోనే తాతపై మనువడు కీర్తి తేజ పగను పెంచుకున్నారని చెప్పారు. ఆ కారణంగానే హత్య చేసినట్లు తెలుస్తోందన్నారు. 73 సార్లు చంద్రశేఖర్‌ని కత్తితో మనవడు కీర్తి తేజ పొడిచి చంపారని అన్నారు. మిగతా మనవలను చూసినట్లుగా తనను చూడలేదని కసితో హత్య చేసినట్లు పోలీసులు వివరించారు. పోలీసుల వివరాల ప్రకారం ఇటీవల కంపెనీలో ఒక మనవడికి డైరెక్టర్ పోస్ట్‌ను చంద్రశేఖర్ ఇచ్చాడు. తనకు కూడా డైరెక్టర్ పోస్టు కావాలని కీర్తి తేజ తన తాతయ్యను డిమాండ్ చేశాడు. అమెరికాలో ఉండి ఇటీవలే హైదరాబాద్‌కు కీర్తి తేజ వచ్చాడు. కీర్తి తేజ చెడు వ్యసనాలను చూసి డైరెక్టర్ పోస్టును చంద్రశేఖర్ ఇవ్వలేదు. డైరెక్టర్ పోస్ట్ ఇవ్వకపోవడంతో 73 సార్లు కసితో కీర్తి తేజ చంపాడని పోలీసులు తెలిపారు. చంద్రశేఖర్‌ని చంపుతుంటే అడ్డం వచ్చిన తల్లిపై 12సార్లు కీర్తి తేజ పొడిచాడు. తల్లి తాత అరుపులు విని ఇంట్లోకి స్థానికులు వచ్చారు. అప్పటికే చంద్రశేఖర్ చనిపోగా తీవ్ర గాయాలతో కీర్తి తేజ తల్లి కొట్టుమిట్టాడారు. కీర్తి తేజ తల్లిని ఆస్పత్రికి పోలీసులు తరలించారు. తాతను చంపి తల్లిని గాయాల పాలు చేసి కీర్తి తేజ ఏలూరు పారిపోయాడు. కీర్తి తేజను ఏలూరులో పోలీసులు అరెస్టు చేశారు. టీటీడీకి గతంలో రూ.40 కోట్లకు పైగా విరాళాలను చంద్రశేఖర్ ఇచ్చారు. ప్రముఖ వెల్జాన్ కంపెనీకి చైర్మన్‌గా చంద్రశేఖర్ కొనసాగుతున్నారు. వందల కోట్ల రూపాయల ఆస్తులను చంద్రశేఖర్ కలిగి ఉన్నారు" అని పోలీసులు తెలిపారు.

## విలేకరుల ముసుగులో అక్రమ దందాలకు పాల్పడుతున్నా వారిపై కేసు నమోదు

**ఎవరైనా ఇలాంటి బెదిరింపులకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలి : ఎస్ఐ శ్యామ్ పటేల్**

హైద్రాబాద్ జై భీమ్ న్యూస్

ఆదివారం రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో జక్కుల శ్రీధర్, మొగిలి అనిల్ లు, గోదావరిఖని, రాజన్నల కులానికి చెందిన మారుభేరస్తులు సంపుటం గ్రామంలో 6 ఎద్దులను కొనుగోలు చేసుకుని ఒక మహేంద్ర వ్యాన్లో పెద్దపల్లి పశువుల సంతకు అమ్ముకొనుటకు తీసుకెళుతుండగా తెల్లవారుజామున ఒక ఫోర్డ్ కార్ నెంబర్ ఎపి 36 ఎం 1166 గలదానిలో 7 గురు వ్యక్తులు వేలేకరులమని చొప్పదండి జనార్ధన్, మూగజీవాల సేవా సంఘం అధ్యక్షులు, డిజెఎఫ్ డిస్టిక్ ప్రెసిడెంట్, తుంగ రమేష్, మాసాని రమేష్, తోడేటి సంతోష్, జిల్లపల్లి పోచం, తగరం వెంకటేష్ (ధ్రువ న్యూస్, దొబ్బల విష్ణు అను వారు వేమనపల్లి వైన్స్ షాప్ దగ్గరలో ఇట్టి పశువుల వ్యాను అడ్డగించి తాము విలేకరులమని అందులో ఆవులు ఉన్నాయని, పరిమితికి మించి తీసుకపోతున్నారని, అందులో ఒకరు మూగజీవాల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడనని, అట్టి వ్యాన్ లో ఉన్న ఫిర్యాదుని మరియు మరో వ్యక్తిని వ్యాన్ సీజ్ చేపిస్తామని, జైలుకు పంపిస్తామని భయభ్రాంతులకు గురిచేసి డబ్బులు డిమాండ్ చేయగా వారు ఒప్పుకోకపోగా పోలీస్ వారికి సమాచారం ఇస్తున్నామని చెప్పి, మీరు బేరానికి ఇటువైపు వస్తే మీ సంగతి చూస్తామని కూడా బెదిరించడం జరిగిందనీ పిర్యాదు చేయడం జరిగింది. ఫిర్యాది తేదీ 20 జనవరి 2025న తెల్లారి జామున మూడు గంటలకు ఫిర్యాది అన్న కొడుకు గాదె మహేష్ బర్లను(గేదెల) కొనుక్కొని కల్లంపల్లి నుండి గోదావరిఖనికి వెళ్లుచుండగా కల్లంపల్లి స్కూల్ దగ్గర వాహనాన్ని అడ్డగించి బజరంగ్దళ్, గో సంరక్షకులమని కొందరు, మరికొందరు విలేకరులమని రూ 3 లక్షలు ఇవ్వమని లేకుంటే కేసులు పెడదామని బెదిరించి డబ్బులు ఇవ్వకుంటే మీ సంగతి చూస్తామని కూడా బెదిరించడం జరిగింది. వీరి బెదిరింపులకు భయపడి ఫిర్యాది 25 వేల నగదు, మహేష్ తన ఫోన్ పే నెంబర్ 9177 322 625 నుండి అందులోనే ఉన్న తోడేటి సంతోష్ అను వ్యక్తి ఫోన్ పే నెంబర్ 966 68643 కి బలవంతంగా ఫోన్ పే ద్వారా డబ్బు బదిలీ చేయించుకోవడం జరిగిందని, తేదీ 3 ఫిబ్రవరి 2025న పై వ్యక్తులు మాస్కులు ధరించి ఫిర్యాదు బావమరిది ఆవులు ఐలయ్య దున్నపోతులు కల్లంపల్లిలో కొనుక్కొని వ్యానులో గోదావరిఖని తీసుక వెళ్ళుచుండగా దస్నాపూర్ ఆశ్రమ పాఠశాల మూలమలుపు వద్ద ఆపి లక్ష రూపాయలు డిమాండ్ చేసి రూ 15000 నగదు తీసుకోవడం జరిగిందని, రాజన్నల కులానికి చెందిన వారిని విలేకరుల ముసుగులో భయభ్రాంతులకు గురిచేసి డబ్బులు కా చేసినారని వారిపై చట్టపరమైన చర్య తీసుకోవాలని ఫిర్యాది కోరగా పై వారందరిపై కేసు నమోదు అయినది. వీరి ఆగడాలపై బాధితులు ఎవరైనా ఉంటే నిర్భయంగా నీల్వాయి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని కోరడమైనది.

## గుండె జబ్బులని దూరంగా ఉంచే ఆహారాలు..?

గుండె జబ్బులని దూరంగా ఉంచే ఆహారాలు ఇవే ?ప్రస్తుత కాలంలో గుండెకు సంబంధించిన వ్యాధులతో చాలా మంది చాలా రకాలుగా బాధపడుతున్నారు. జీవనశైలి, తీసుకునే ఆహారం, టెన్షన్ ఇంకా ఉద్యోగంలో ఒత్తిడి వంటి కారణాల వల్ల మనిషికి గుండెకు సంబంధించిన వ్యాధులు చాలా ఎక్కువ అవుతున్నాయి. ఆరోగ్యకరమైన ఆహారం, శరీరానికి అనువైన వ్యాయామం ఇంకా దురవాట్లకు దూరంగా ఉండటం గుండె ఆరోగ్యానికి చాలా మంచిది.మధుమేహం, అధిక రక్తపోటు , మూత్రపిండ వ్యాధులు, అలాగే దంత వ్యాధులు గుండెజబ్బులకు ఖచ్చితంగా దారితీస్తాయి. అలాగే అస్థిరంగా రొమ్మునొప్పి, రక్తపోటు అధికమవటం ఇంకా గుండె పని విధానంలో అసాధారణంగా ఉండటం లాంటివి కనిపించగానే ఖచ్చితంగా వైద్యున్ని సంప్రదించాలి.దేశంలో గుండె సమస్యలతో చాలా మంది బాధపడుతున్నారు. గుండె సంబంధిత వ్యాధుల వల్ల చాలా మంది మరణిస్తున్నారు.వేళకు ఆహారం తీసుకోకపోవడం, వ్యక్తిగత, వృత్తిపరమైన ఒత్తిళ్లు ఇంకా తగినంత వ్యాయమం లేకపోవడం వంటివి గుండె పనితీరును మందగింపజేస్తున్నాయి. అలాగే రక్తనాళాల్లో కోలెస్ట్రాల్ స్థాయిలు పెరిగిపోవడం కూడా గుండె పనితీరును ప్రభావితం చేస్తోందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.ఇంకా ఆరోగ్యంగా ఉండాలంటే ఖచ్చితంగా ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.సాధారణంగా చేపలు ఎక్కువగా తినేవారిలో గుండె సంబంధిత వ్యాధులు తక్కువగా వస్తాయని అంటున్నారు వైద్య నిపుణులు. చేపల్లో ఉండే ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు గుండె పనితీరును బాగా మెరుగుపరుస్తాయి.అలాగే ఆకు కూరలు గుండెకు చాలా మంచిది. క్యాన్సర్ వంటి రోగాలను కూడా దరిచేరనివ్వవు. పాలకూర, కొత్తమీద, ర్యాడిష్ మొదలైన వాటిలో కొవ్వు శాతం తక్కువ ఉండటంతో పాటు ఫోలిక్ యాసిడ్, మెగ్నీషియం, కాల్షియం ఇంకా పోటాషియం ఎక్కువగా లభిస్తాయి.

# రాజ్యాంగ రక్షణలో ఆత్మగౌరవ పొగరు దాగింది










**రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటాను**

**భారతదేశ ప్రామాణికలు విలువలతో ఉన్నాయంటే రాజ్యాంగ పుణ్యమే**

**ఫెడరల్స్ స్ఫూర్తికి వ్యతిరేక ఉద్యమాలు జరగాల్సి ఉంది**

**రాజకీయ స్వార్థం వీడితేనే ప్రజాసేవ చేయగలం**

**బలమైన సేవ భావమే ప్రజా క్షేత్రంలో బలంగా నిలబెడుతుంది**

**అడ్డంకులను ఎదురుకొని అధిగమించాలంటే ఆత్మస్థైర్యం గొప్పదై ఉండాలి**

**మలియాళీ దినపత్రిక ముఖాముఖి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్ జై భీమ్ న్యూస్:

భారత రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను, గ్యారంటీలను రక్షించుకునేందుకు దక్షిణాది రాష్ట్రాలు ఏకం కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలిగించే 'ఒకే వ్యక్తి.. ఒకే పార్టీ..' తరహా విధానాలను ఉమ్మడిగా వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రఖ్యాత మలయాళీ దినపత్రిక మాతృభూమి తిరువనంతపురంలో ఏర్పాటు చేసిన "మాతృభూమి ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్" సదస్సు (ఎమ్ బిఐఎఫ్ ఎల్ 2025)లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని, ప్రసంగించారు. అలాగే, మాతృభూమి ఎడిటర్ మనోజ్ కె.దాస్ , కొందరు సభికులు ముఖాముఖి అడిగిన ప్రశ్నలకూ ముఖ్యమంత్రి సమాధానాలిచ్చారు. "దశాబ్దాలపాటు కుటుంబ నియంత్రణ విధానాలు పాటించి, మెరుగైన సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసే స్థితిలో దక్షిణాది రాష్ట్రాలు ఉన్నాయి. అలాంటిది ఇప్పుడు జనాభా ప్రాతిపదికన పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టి దక్షిణాదిని శిక్షిస్తున్నారా? ప్రపంచంలోనే అత్యుత్తమంగా రాష్ట్రాన్ని నిలబెట్టేలా తెలంగాణ రైజింగ్ నినాదంతో సమగ్ర, సమ్మిళిత అభివృద్ధి కార్యాచరణ తీసుకున్నాం. హైదరాబాద్ ను విశ్వనగరంగా తీర్చిదిద్దే ప్రణాళికలను ఇప్పటికే అమలు చేస్తున్నాం. అంతర్జాతీయ పెట్టుబడులకు తెలంగాణ కేంద్రంగా మారుతోంది. ఇటీవల దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో రాష్ట్రానికి రూ.1.82 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు వచ్చాయి. పారిశ్రామిక రంగం అభివృద్ధితో పాటు అన్ని వర్గాలకు సంక్షేమాన్నీ సమర్ధవంతంగా అమలు చేస్తున్నాం. ముఖ్యంగా రైతులకు 24 గంటలు ఉచిత విద్యుత్ సరఫరా, ఎకరాకు రూ.12 వేలు రైతు భరోసా, భూమి లేని కుటుంబాలకు ఏడాదికి రూ.12 వేలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇస్తున్నాం. పంటలకు కనీస మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నాం. దేశంలోనే రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. 25 లక్షల రైతు కుటుంబాలకు రూ.21 వేల కోట్ల రుణ మాఫీ చేశాం. సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీ విధానం. సమగ్ర కుల సర్వే చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ. సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఎస్సీ వర్గీకరణను అమలుకు పూనుకున్న తొలి రాష్ట్రం కూడా తెలంగాణే. ఈ అంశాలను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఫిబ్రవరి 4వ తేదీని ఏటా 'తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం'గా జరుపుకుంటాం. జనాభా దామాషా ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు వనరులు సమకూర్చుతాం. సుపరిపాలన ఏడాదిలోనే ఎంత మార్పు తెస్తుందనేందుకు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఒక ఉదాహారణ. కేంద్ర ప్రభుత్వ తాజా ఆర్థిక సర్వే నివేదిక ప్రకారం అతి తక్కువ ద్రవ్యోల్బణం ఉన్న రాష్ట్రం తెలంగాణ. తలసరి ఆదాయంలోనూ ప్రథమ స్థానంలో ఉన్నాం. తెలంగాణ ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థ అయితే అది భారతదేశ వృద్ధికి ప్రయోజనం కాదా? మరి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు అండగా ఎందుకు ఉండటం లేదు? ప్రత్యేకించి దక్షిణాది రాష్ట్రాలు, బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలకు కేంద్రం ఎందుకు మద్దతుగా నిలవడం లేదు?" అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు.

# బడ్జెట్‌తో గిరిజనులకు ఒరిగేదేమిటి?

బడ్జెట్‌కి ముందు వెలువరించే ఆర్థిక సర్వే ప్రకారంగా వివిధ తరగతులకు లబ్ధి జరిగేలా బడ్జెట్ రూపొందించవలసిన అవసరం ఉంది. ఆదివాసీ విద్య, వైద్యం విషయమై నిర్లక్ష్యం జరిగిందని ఆర్థిక సర్వే తెలిపింది. దీనికి అనుగుణంగా కాకుండా వివిధ వర్గాలకు అన్యాయం చేసేలా ముఖ్యంగా ఆదివాసులపై మరింత దోపిడీ పెంచేవిధంగా, ఆదివాసీ ప్రాంత వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశ పెట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గిరిజనుల అభివద్ధికి నిధులు కోత పెట్టారు. రూ.50,65,345 కోట్ల బడ్జెట్‌లో జనాభా నిష్పత్తి ప్రకారం గిరిజనులకు ఏమాత్రం కేటాయింపులు జరిగాయో చూద్దాం. దేశ గిరిజన జనాభా సుమారు 8.8 కోట్లు. జనాభా నిష్పత్తి ప్రకారం కేటాయింపులు 8.6 శాతం అంటే రూ. 5,88,993 కోట్లు కేటాయించాల్సి ఉండగా కేవలం ఈ ఏడాది రూ.1,29,249 కోట్లు మాత్రమే కేటాయించి గిరిజనులకు తీరని అన్యాయం చేశారు. ఇందులోనే గిరిజన వ్యవహారాల శాఖకు ఈ ఏడాది కేవలం రూ.14,925 కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకున్నారు. గిరిజనుల అభివృద్ధికి నేరుగా ఉపయోగపడే రంగాల్లో కేటాయింపులు పూర్తిగా తగ్గించి కార్పొరేట్లు, బడా కాంట్రాక్టర్లు, ధనవంతులకు లబ్ధి చేకూర్చే రంగాల్లో మాత్రం గణనీయమైన కేటాయింపులు చేశారు. ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు గతేడాది రూ.440 కోట్లు కేటాయించగా ఈ ఏడాది రూ.313 కోట్లు, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు గతేడాది రూ.2432 కోట్లు కేటాయించగా ఈ ఏడాది రూ.30 కోట్లు మాత్రమే అదనంగా పెంచి చూపించారు. దేశంలో గణనీయంగా పెరుగుతున్న గిరిజన విద్యార్థుల సంఖ్యతో పోల్చుకుంటే ఇవి ఏ మాత్రం సరిపోదు. రాజ్యాంగబద్ధంగా 275(1) అధికరణ ద్వారా షెడ్యూల్డ్ ప్రాంత గిరిజనుల అభివృద్ధికి గ్రాంట్‌గా ఇవ్వాల్సిన నిధులను సైతం పెంచకపోవడం దుర్మార్గం. దీనికి గతేడాది రూ. 1541 కోట్లు కేటాయించగా ఈ ఏడాది ఒక్క రూపాయి కూడా అదనంగా కేటాయించలేదు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో భాగంగా తెలంగాణ, ఆంధ్రలో గిరిజన యూనివర్సిటీలు మంజూరు చేసి పదేళు దాటినా అతీగతీ లేదు. ఈ బడ్జెట్‌లో ఆంధ్ర, తెలంగాణ యూనివర్సిటీలకు కలిపి ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా గిరిజనులను కేంద్రం మోసం చేసింది. రాజ్యాంగం ప్రకారం గిరిజనులకు హక్కుగా కేటాయింపులు చేయాల్సిన గిరిజన సబ్‌ప్లాన్‌ను సైతం రద్దు చేసింది. ఆదివాసీలకు ఉపాధి వంటి రంగాల్లో కీలకమైన స్కిల్ డెవలప్‌మెంట్‌కు నిధులను అధికంగా కేటాయించకపోవడం బాధాకరం. ఆదివాసీ నిరుద్యోగులు ఉద్యోగావకాశాలు పొందేలా ఈ బడ్జెట్‌లో కేటాయింపులు లేవు. చేసిన కొద్దిపాటి కేటాయింపు సైతం డేటా సెంటర్లకు లాభాలు కల్గించేలా ఉంది. ఈ రంగానికి బడ్జెట్‌లో రూ.317 కోట్ల నిధులు కేటాయించారు. గత ఏడాది రూ.470 కోట్లు కేటాయించారు. అంటే పోయిన సంవత్సరం కేటాయించిన బడ్జెట్‌లో కోత విధించారన్నమాట.గిరిజనుల్లో పారిశ్రామిక వ్యాపార అవకాశాలు పొందే విధంగా కేటాయింపులు లేవు. గతేడాది చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సంబంధించి బడ్జెట్ కేటాయింపులు చూసినప్పుడు గతేడాది రూ.10,881 కోట్లు ఈ ఏడాది రూ.2116 కోట్లు నిధులు మాత్రమే కేటాయించారు. ఆ నిధుల కేటాయింపు కూడా కార్పొరేట్ సంస్థల ఖాతాలో స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో పోతుంది. గిరిజన శాఖల నిధులను ప్రభుత్వం దారి మళ్లిస్తున్నది. ఉదాహరణకు గత ఏడాది రూ.16,300 కోట్లు నిధులను హైవే రోడ్లకు కేటాయించారు. ఇదిలా వుండగా ఆదివాసుల గ్రామాల్లో రోడ్లు, మౌలిక వసతులు లేని కారణంగా రోజూ డోలీ మోతలే కనిపిస్తాయి. పైగా కేటాయించిన నిధులను కూడా ఖర్చు చెయ్యడం లేదు. బడ్జెట్ కేటాయింపులలో ఆదివాసీలకు ఉపాధి భరోసా ఇవ్వలేదు. బడ్జెట్ కేటాయింపులో కేవలం రూ.2 వేల కోట్ల నిధులు చూపించారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో నియామకాలు లేవు. బ్యాక్‌లాగ్ పోస్టుల ఊసే లేదు. వలసల నివారణకు చర్యలు లేవు. అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలపై ఎటువంటి నిధులూ కేటాయించలేదు. 2021-22 కేంద్ర బడ్జెట్‌లో రూ.155 కోట్ల నిధులు కేటాయించిన తర్వాత ఇప్పటి వరకూ రూపాయి కేటాయించలేదు. గత ఏడాది ఆర్టికల్ 275(1) ప్రకారం రూ.1541 కోట్లు కేటాయించగా ఈ ఏడాది బడ్జెట్ కేటాయింపులు లేవు. ఈ నిధులు ఎక్కువగా ఆదివాసీ ప్రాంతంలో సంక్షేమం కోసం ఖర్చు చేస్తుంది. ఐటిడిఎలో ఈ నిధులతోనే గతంలో సంక్షేమ పథకాలకు కొంత సహాయం అందేది. ఇప్పుడు నిధులు లేక ఐటిడిఏలు ఉత్సవ విగ్రహాలుగా తయారయ్యాయి. ప్రధాన మంత్రి జన్మభూమి యోజన (పి.ఎమ్ జన్మన్) లక్ష్యం ప్రాథమిక సదుపాయాల కల్పన, ఆరోగ్యం, విద్య, ఆవాసాల నిర్మాణం, పోషకాహారం అందించడం. దేశంలో 75 రకాల ఆదిమజాతి పివిటిజి వెనుకబడిన ఆదివాసీ గిరిజన తెగల వారు జీవిస్తున్నారు. బడ్జెట్ కేటాయింపులు వారి జీవన ప్రమాణాలు పెంచేవిధంగా లేవు. ఆదివాసులకు ఇళ్ల నిర్మాణానికి, మౌలిక వసతులు, విద్య, వైద్యం, పౌష్టికాహారం కల్పించేందుకు పివిటిజి పథకాన్ని 2023 అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వ్యాలీ బల్లుగూడలో ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించారు. ప్రతిష్టాత్మకంగా ఈ పథకానికి ఐదేళ్లపాటు ఖర్చు చెయ్యడానికి రూ.24 వేల కోట్లు కేటాయిస్తునట్లు ప్రచారం చేశారు. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.6 వేల కోట్లు కేటాయించారు. జన్మన్ యోజన పథకం ద్వారా ఇంటి నిర్మాణానికి ఈ నిధులు చాలడంలేదు. ఇళ్ల నిర్మాణానికి కనీసం రూ.5 లక్షలు నిధులు కేటాయించాలి.అటవీ ఉత్పత్తుల గిట్టుబాటు ధరల కోసం 2021, 2022లో రూ.155 కోట్ల నిధులు విడుదల చేశారు. ఆ తర్వాత నిధులు కేటాయింపు లేవు. దేశంలో కోట్లాది మంది ఆదివాసీ ప్రజలు ఆధారపడి జీవిస్తున్న అటవీ ఉత్పత్తుల గిట్టుబాటు ధరల ఊసే లేదు.షెడ్యూల్ ప్రాంతంలో టూరిజం అభివృద్ధికి భారీ ఎత్తున ప్రోత్సాహకాలు ఇస్తున్నట్లు సుమారు రూ.20 వేల కోట్లు పెట్టుబడి పెడుతున్నట్లు కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రకటించింది. కానీ వాస్తవానికి సహజ వనరులను, అడవిని, భూమిని కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పేందుకే ఈ ఎత్తుగడ. దీనికి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సభాపతి 1/70 చట్టాన్ని సవరించాలని ప్రకటించారు. ఆదివాసీలకు అన్యాయం చేసిన కేంద్ర బడ్జెట్‌పై నిరసన కార్యక్రమాలు చేపట్టాలి. ప్రభుత్వంపై ఒత్తిడి చేసి బడ్జెట్ కేటాయింపులు పెంచుకోవాలి.